క్లుప్తంగా

దుర్గమ్మ సన్నిధిలో పూజలు



విశేష అలంకారంలో శ్రీ విజయదుర్గమ్మ

కడప కల్చరల్ : కడప నగరం శ్రీ విజయ దుర్గాదేవి ఆలయంలో మంగళవారం భక్తులు దోష నివారణ కోసం రాహుకాల పూజలను నిర్వహించారు. తొలుత అమ్మవారి మూలమూర్తిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో సామూహికంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ అర్చకులు పూజా విధానాన్ని తెలుపుతూ కార్యక్రమాన్ని నిర్వహింపజేశారు. భక్తులు అమ్మవారికి నిమ్మకాయ దీపాలను వెలిగించి మొక్కుకున్నారు. నిర్వాహకులు సుధా మల్లికార్జునరావు, దుర్గాప్రసాద్ భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

బహిరంగ వేలం పాట

కడప కార్పొరేషన్ : కడప నగరపాలక సంస్థకు చెందిన గొర్రెలు, మేకల వధశాల, ఎద్దుల వధశాలలకు మంగళవారం బహిరంగ వేలం నిర్వహించినట్లు కమిషనర్ మనోజ్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేలంలో కె. అలావుద్దీన్ అనే వ్యక్తి రూ.12.23లక్షలకు గొర్రెల, మేకల వధశాల గుత్తను సొంతం చేసుకున్నారన్నారు. కె. కరిమూన్ అనే మహిళ రూ.3.93లక్షల హెచ్చుపాట పాడి ఎద్దుల వధశాల గుత్తను పొందారన్నారు. పాత కూరగాయల మార్కెట్, కొత్త కూరగాయల మార్కెట్, బీఫ్ స్టాల్స్, మటన్ స్టాల్స్‌కు సంబంధించిన వేలాన్ని 29వ తేది మధ్యాహ్నం 3 గంటలకు నగరపాలక సంస్థ సమావేశ భవనంలో నిర్వహిస్తామన్నారు. ఆసక్తిగలవారు ఈనెల 28వ తేది సాయంత్రం 5 గంటల్లోపు డిపాజిట్ చెల్లించి రశీదులు, అప్లికేషన్లు సమర్పించి వేలంలో పాల్గొనవచ్చన్నారు.

మధ్యవర్తిత్వంపై శిక్షణ



మాట్లాడుతున్న రీసోర్స్ పర్సన్ పీజీ సురేష్

కడప అర్బన్ : జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీదేవి, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబా ఫక్రుద్దీన్‌లు కడప న్యాయ సేవా సదన్‌లో మధ్యవర్తిత్వంపై న్యాయవాదులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కేరళ రీసోర్స్ పర్సన్ పీజీ సురేష్ మాట్లాడుతూ న్యాయవాదుల పాత్ర, మధ్యవర్తిత్వం, రాజీ నియమాలు, కమ్యూనికేషన్ నిర్వచనం, ప్రక్రియ, ప్రభావవంతమైన, సమర్థమైన కమ్యూనికేషన్, ప్రయోజనాలు కమ్యూనికేషన్ రకాలు, కమ్యూనికేషన్ పద్ధతులు, మౌఖిక కమ్యూనికేషన్, బాడీ లాంగ్వేజ్ ప్రశ్నలు, తటస్థతతో సానుభూతి, రోల్ ప్లే–4 మొదలగు అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో రీసోర్స్ పర్సన్ జి జ్యోతి, న్యాయవాదులు పాల్గొన్నారు.

పోలీసుల విస్తృత తనిఖీలు



రైల్వేస్టేషన్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది

కడప కోటిరెడ్డిసర్కిల్ : జిల్లాను గంజాయి రహిత జిల్లాగా రూపొందించడమే లక్ష్యంగా విశాఖ పట్నం, విజయవాడ నుంచి కడపకు వచ్చే రైళ్లు, బస్సులు, పార్శల్ కేంద్రాల్లో పోలీస్ అధికారులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. మంగళవారం ఉదయం విశాఖపట్నం నుండి కడపకు చేరుకున్న తిరుమల ఎక్స్‌ప్రెస్ రైలులో తనిఖీలు నిర్వహించారు. ప్రయాణికుల లగేజీని పరిశీలించారు. అనంతరం నగరంలోని బస్టాండు, సెవెన్ రోడ్స్ వద్ద ఉన్న ప్రైవేట్ ట్రావెల్స్ కార్యాలయాలలో, పార్శల్ సెంటర్లు, గోడౌన్‌లలో తెల్లవారుజామున విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. గంజాయి రవాణాకు పాల్పడినా, సహకరించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీల్లో ఫ్యాక్షన్ జోన్ ఇన్‌స్పెక్టర్ రమణారెడ్డి, జీఆర్‌పీ ఎస్ఐ సునీల్ కుమార్ రెడ్డి, ఆర్‌పీఎఫ్ ఎస్ఐ నాగభూషణం, స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదానం



రక్తదానం చేస్తున్న కానిస్టేబుల్ మేషక్‌బాబు

కడప అర్బన్ : ఆపదలో ఉన్న ఓ వ్యక్తికి రక్తదానం చేసి ప్రాణదాతగా నిలిచారు పోలీస్ కానిస్టేబుల్ మేషాక్ బాబు. వివరాల్లోకెళితే.. కడప నగరం ఎర్రముక్కపల్లి కి చెందిన డయాలసిస్ చేయించుకుంటున్న విజయ్ బాబు అనే వ్యక్తికి ఏబి పాజిటివ్ బ్లడ్ గ్రూప్ రక్తం అత్యవసరమని నగరంలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్ వైద్యులు తెలిపారు. సమాచారం తెలుసుకున్న పోలీస్ కళాజాగృతి బృందం కానిస్టేబుల్ మేషాక్ బాబు(పీసీనెం. 1283) వెంటనే స్పందించి రక్తదానం చేసి ప్రాణాపాయం నుండి తప్పించారు. రక్తదానం చేసిన మేషాక్ బాబు ను పోలీస్ అధికారులు అభినందించారు.

పచ్చటి పందిరి





ఎండలు మండుతున్నాయి. ఎండ వేడికి ఎక్కడ చూసినా పచ్చదనం కరువవుతోంది. దీనికి భిన్నంగా పుష్పగిరి కంటి ఆసుపత్రిలో క్యాంటీన్ మొక్కలతో నిండి పచ్చదనాన్ని సంతరించుకుంది. ఇక్కడికి వచ్చిన రోగులు ఈ క్యాంటీన్‌లో సేదదీరుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కడప

పేపర్ లీకేజీపై సమగ్ర విచారణ జరిపించాలి



డీఈఓకు వినతిపత్రాన్ని సమర్పిస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

కడప ఎడ్యుకేషన్ : జిల్లాలోని వల్లూరు, వేంపల్లెలలో పదవ తరగతి పరీక్షల మ్యాథ్స్ పేపర్ లీకేజీ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ కోరారు. ఈ విషయమై మంగళవారం డీఈఓ షేక్ షంషుద్దీన్‌ను కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షల పట్ల విద్యార్థులలో అపోహలు తొలగించి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని కోరారు. జిల్లాలో పదవ తరగతి పరీక్షలు ప్రారంభమైనప్పటి నుండి అనేక అనుమానాల మధ్య పరీక్షల నిర్వహణ జరుగుతోందన్నారు. ప్రధానంగా ప్రైవేటు స్కూల్స్ యాజమాన్యాలు కొంత మంది పరీక్షా సెంటర్లలోని ఇన్విజిలేటర్లు, ఎగ్జామినర్ చీఫ్‌లను ప్రలోభాలకు గురి చేసిచేస్తున్నారని అనేక ఆరోపణలు వస్తున్నాయని అన్నారు. వేంపల్లి, వల్లూరులలోనే కాదని ముద్దనూరు, కమలాపురం, ప్రొద్దుటూరు, పెండ్లిమర్రి ఏరియాలలో కూడా అనేక అనుమానాలకు ప్రేరేపించే విధంగా సంఘటనలు జరుగుతున్నాయని అన్నారు. స్థానిక మండల విద్యాశాఖ అధికారులు పర్యవేక్షణ లోపం కారణంగానే ఇవన్నీ జరుగుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో నగర నాయకులు సురేష్ పాల్గొన్నారు.

మూల్యాంకన కేంద్రాలలో వసతులు కల్పించాలి



ఆర్‌జేడీకి వినతిపత్రాన్ని సమర్పిస్తున్న ఎన్‌టీఏ నాయకులు

కడప ఎడ్యుకేషన్ : రాయలసీమ జోన్ వ్యాప్తంగా ఏప్రిల్ 3వ తేదీ నుండి ప్రారంభంకానున్న పదవ తరగతి మూల్యాంకన కేంద్రాలలో అన్ని మౌలిక వసతులను కల్పించాలని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ (ఎన్‌టీఏ) రాష్ట్ర అధ్యక్షుడు కొండూరు శ్రీనివాసరాజు కోరారు. ఈ విషయమై మంగళవారం పాఠశాల విద్య ఆర్‌జేడీని కడపలో కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 58 సంవత్సరాలు పైబడిన ఉపాధ్యాయుల తోపాటు దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న ఉపాధ్యాయులకు మూల్యాంకన విధులనుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్‌టీఏ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు రెడ్డి రమేష్ బాబు, రాష్ట్ర కార్యదర్శి సురేష్ కుమార్, రాష్ట్ర కౌన్సిలర్ అబ్దుల్ గఫార్, వైఎస్సార్ కడప జిల్లా అధ్యక్షులు రామకృష్ణమరాజు, గౌరవాధ్యక్షులు కూరాకు రవీంద్ర, జిల్లా నాయకులు బీసీ సుబ్బరాయుడు, ఆర్థిక కార్యదర్శి చలపతిరాజు తదితరులు పాల్గొన్నారు.

చక్కని జీవనశైలితో ఆరోగ్యం



సూచనలు ఇస్తున్న డాక్టర్ తేజశ్విని

కడప ఎడ్యుకేషన్ : సరైన జీవనశైలిని అనుసరిస్తే మహిళలు అనారోగ్య సమస్యల నుంచి దూరంగా ఉండవచ్చని గైనకాలజిస్ట్ డాక్టర్ తేజస్విని పేర్కొన్నారు. మంగళవారం యోగి వేమన విశ్వ విద్యాలయం ఉమెన్ సెల్, వైవీయూ జాతీయ సేవా పథకం యూనిట్ -9, పల్లా హాస్పిటల్, కడప సహకారంతో అన్నమాచార్య సెనెట్ హాల్‌లో '' గైనకాలజికల్ సమస్యలపై మహిళలకు అవగాహన కార్యక్రమాన్ని రిజిస్ట్రార్ ప్రొ. పి . పద్మ ప్రారంభించగా, ప్రిన్సిపాల్ ప్రొ. ఎస్. రఘునాథరెడ్డి సభాధ్యక్షత వహించారు.

ఈ సందర్భంగా డా. తేజశ్విని మాట్లాడుతూ ప్రతి ఇంట్లో మహిళల పాత్ర గురించి చెప్పక్కర్లేదని మహిళ తన జీవితంలో పని, వ్యక్తిగత జీవితం మధ్య సమతుల్యతను సృష్టించడానికి ప్రయత్నిస్తుందన్నారు. ఒకప్పటితో పోలిస్తే మహిళలు కెరీర్‌కు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. దీంతో ఇంట్లో పనులు, ఆఫీస్ పనులతో బిజీ అయిపోతున్నారని తెలిపారు. ఈ బిజీ జీవితంలో మహిళలు తమ బాధ్యతల్లో పడిపోయి ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. 40 ఏళ్ల తర్వాత ఆడవారికి ఎన్నో సమస్యలు వస్తాయని, వయసు పెరగడం, సరైన జీవనశైలి లేకపోవడం, ఇతర కారణాల ప్రభావాలతో ఆరోగ్య సమస్యలు ఎదురవుతాయన్నారు. వీటన్నింటికీ సమతుల్య ఆహారం తీసుకుని, జీవనశైలి మార్పు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ ఆరోగ్య కేంద్రం వైద్యులు డా. నరేష్ కుమార్ రెడ్డి, ఉమెన్ సెల్ డైరెక్టర్స్ ప్రొ ఎల్ . మాధవి, ప్రొ. డి విజయ లక్ష్మి, ప్రొ.అను ప్రసన్న, బిందు, ఎన్ఎస్ఎస్ యూనిట్– 9 ప్రోగ్రామ్ ఆఫీసర్ డా. కె. శ్రీనివాస రావు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

బేడ బుడగజంగం సమస్యల పరిష్కారానికి కృషి



పస్తం అంజిని సత్కరిస్తున్న బేడ, బుడగ జంగం నాయకులు

కడప సెవెన్‌రోడ్స్ / కడప కార్పొరేషన్ : బేడ, బుడగ జంగం కులానికి చెందిన ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఎప్పటిలాగే కృషి చేస్తానని ఆ సంఘం నాయకులు పస్తం అంజి తెలిపారు. కడప నగరం 48వ డివిజన్ బుడగజంగం కాలనీలో మంగళవారం వివిధప్రజా సంఘాల నాయకులు అయనను ఘనంగా సన్మానించారు. దళిత నాయకులు స్వామినాథన్, జోజప్ప, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు బత్తల లింగమూర్తి, న్యాయవాది రమేష్‌బాబు తదితరులు మాట్లాడుతూ బేడ బుడగ జంగం కులాలకు చెందిన ప్రజలకు ఎస్సీ సర్టిఫికెట్లు జారీచేయాలంటూ అంజి ఆధ్వర్యంలో పలు పోరాటాలు జరిగాయని తెలిపారు. ఎస్సీ కులాల జాబితాలోని సీరియల్ నెంబరు 9లో బుడగజంగం కులం ఉందని పేర్కొన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో బుడగ జంగాలకు ఎస్సీ కుల సర్టిఫికెట్ ఇచ్చారని, ఆ తర్వాత జీఓ నెం. 144 ద్వారా సర్టిఫికెట్లు నిలిపి వేశారన్నారు. ఈ అంశంపై పలుమార్లు ముఖ్యమంత్రులు, మంత్రులు, కలెక్టర్లు, ఇతర అధికారుల దృష్టికి తీసుకెళ్లిన తర్వాత ఇన్నాళ్లకు ఆ కోరిక నెరవేరిందన్నారు. ఇందుకు కృషి చేసిన అంజి అభినందనీయుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అశోక్‌కుమార్, ప్రదీప్, హరి, నరసింహులు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య కోసం నమోదు చేసుకోండి



వేరు శనగ పంటను పరిశీలిస్తున్న ఏఓ సరస్వతి

కమలాపురం : సొంత భూములు కలిగిన రైతులందరూ ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య కోసం నమోదు చేసుకోవాలని మండల ఏఓ సరస్వతి తెలిపారు. మంగళవారం మండలంలోని గంగవరం, విభరాపురం గ్రామాలలో జరిగిన పొలం పిలుస్తోంది.. కార్యక్రమంలో ఆమె క్షేత్ర స్థాయిలో పర్యటించి కొర్ర, వేరుశగన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేరు శనగ పంట విత్తిన 40–50 రోజుల మధ్య ఏకరానికి 200 కిలోల జిప్సం పొలంలో చల్లుకోవాలన్నారు. తద్వారా గింజ పరిమాణంతో పాటు నూనె శాతం పెరుగుతుందన్నారు. ఆకుముచ్చ నివారణకు 400 గ్రాముల మంకోజబ్, 200 గ్రాములు కార్బెండిజం, లేదా హెక్సా కోనోజోల్ 5శాతం ఎస్సీ 400 మిల్లీ లీటర్లు 200 లీ. నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. అలాగే సొంత భూములు కలిగిన రైతులందరూ సంబంధిత ఆర్‌ఎస్‌కేలకు వెళ్లి ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య కోసం నమోదు చేసుకోవాలన్నారు. మనుషులకు ఆధార్‌లాగే ఈ గుర్తింపు సంఖ్య ఉపయోగపడుతుందన్నారు. భవిష్యత్తులో ప్రభుత్వ పథకాలు వర్తించాలంటే ఈ సంఖ్య తప్పనిసరిగా ఉండాలన్నారు. కార్యక్రమంలో వీఏఏ వెంకటకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

బాలికల విద్య సమాజ సాధికారతకు భరోసా

కడప ఎడ్యుకేషన్ : బాలికల విద్య సమాజ సాధికారతకు భరోసా అని కడప మండల విద్యాశాఖ అధికారి దిద్దుకుంట గంగిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కడప నగరంలోని నగరపాలక ప్రాథమిక పాఠశాల 16వ వార్డులో కేజీబీవీ అడ్మిషన్ల గురించి ప్రధాన ఉపాధ్యాయులకు, విద్యార్థులకు వివరించారు. కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయం (కేజీబీవీ)లలో 6వ తరగతి ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులులేని విద్యార్థినిలు, మధ్యలో బడి మానేసిన పిల్లలు, బడి బయట పిల్లలు, పేద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ బాలికలు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కడప మండలం పరిధిలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కేజీబీవీలలో బాలికలు అడ్మిషన్ పొందుటకు బాధ్యత తీసుకొని ఏప్రిల్ 11వ తేదీ లోపు ఆన్‌లైన్ ప్రక్రియను పూర్తిచేయాలన్నారు. దరఖాస్తులు https://apkgbv.apcfss.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మంజుల, కడప మండల సీఆర్‌ఎంటి ఆదిమూలం శంకర్, కృష్ణ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

డీన్‌పై చర్యలు తీసుకోవాలి

కడప ఎడ్యుకేషన్ : జిల్లాలోని పొద్దుటూరు పూజ ఇంటర్నేషనల్ స్కూల్లో 9వ తరగతి చదువుతున్న తమ కుమారుడు సాత్విక్‌రెడ్డిని ఆ పాఠశాల డీన్ గణేష్‌రెడ్డి ప్లాస్టిక్ పైపుతో తీవ్రంగా కొట్టి గాయపరిచాడని, అతడిపై కఠిన చర్యలు తీసుకోవాలని విద్యార్థి మూలె స్వాతిక్‌రెడ్డి తల్లిదండ్రులు మూలే మాధవరెడ్డి, కొండమ్మ డిమాండ్ చేశారు. ఈ విషయమై మంగళవారం డీఈఓ షేక్ షంషుద్దీన్‌ను కడపలో కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తోటి విద్యార్థులతో తమ కుమారుడు తప్పుడు పద్ధతుల్లో చాటింగ్ చేశాడని ప్రచారం చేస్తున్నారన్నారు. సమస్యలేమైనా ఉంటే మాకు చెప్పాలే కానీ పిల్లోడిని కొట్టడం అన్యాయం అన్నారు. డీన్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వడ్డీలో 50 శాతం రాయితీతో పన్నులు చెల్లించండి

కమలాపురం : మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు ఇప్పటి వరకు ఉన్న బకాయిలకు సంబంధించిన వడ్డీలో 50 శాతం రాయితీతో పన్నులు చెల్లించాలని కమలాపురం మున్సిపల్ కమిషనర్ పగడాల జగన్నాథ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం విడుదల చేసిన జీఓఎంఎస్ నెంబర్ 46 ప్రకారం ఈనెల 31వ తేదీలోగా ఆస్తి పన్ను బకాయిలను వన్‌టైం సెటిల్‌మెంట్ కింద చెల్లిస్తే వడ్డీలో 50 శాతం మాఫీ జరుగుతుందని ఆయన తెలిపారు. అలాగే ఈనెల 30, 31వ తేదీల్లో శెలవు ఉన్నప్పటికి మున్సిపల్ కార్యాలయం పనిచేస్తుందని, పన్నులు చెల్లించవచ్చునన్నారు. అలాగే పన్నులను సీడీఎంఎ.ఏపీ.జీవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్, నెట్ బ్యాంకింగ్, డెబిట్, క్రెడిట్ కార్డుల ద్వారా చెల్లించవచ్చునన్నారు.

28న ఆర్ట్స్ కాలేజీలో జాబ్ మేళా

ప్రొద్దుటూరు: ఈ నెల 28వ తేదీన జవహర్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యాన స్థానిక ఎస్‌సీఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ(ఆర్ట్స్‌కాలేజీ)లో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ జి.చంద్రశేఖర్, జేకేసీ కోఆర్డినేటర్ డాక్టర్ టి.శశికాంత్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. కడప కొప్పర్తిలోని ఏఐఎల్ డిక్సన్ టెక్నాలజీ ప్రైవేట్ కంపెనీలో అసెంబ్లింగ్ ఆపరేటర్, హెల్పర్, టెక్నీషియన్ ఉద్యోగాలకు ఎంపిక చేసేందుకు ఈ మేళా నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ఇంటర్, ఏదైనా డిగ్రీ, ఐటీఐ/డిప్లొమా, బీటెక్ (ఈసీఈ, ఈఈఈ) చదివిన వారు అర్హులన్నారు. ఆసక్తి గల వారు 28న ఉదయం 9 గంటలకు జాబ్ మేళాలో పాల్గొనాలని, మరిన్ని వివరాలకు 9573321678 నంబర్‌కు సంప్రదించాలని కోరారు.

ఉత్తీర్ణత సాధించిన తేజేష్

సిద్దవటం : మండలంలోని మోదీన్‌సాబ్‌పల్లె గ్రామానికి చెందిన కాశిగారి శ్రీనివాసప్రసాద్ కుమారుడు కాశిగారి తేజేష్ అనే విద్యార్థి జవహర్ నవోదయ ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణత సాధించారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జనవరి 18వ తేదీన జవహర్ నవోదయ పాఠశాలకు 6వ తరగతి ప్రవేశాలకు ప్రవేశ పరీక్షను నిర్వహించారు. ఈ పరీక్షలో తేజేష్ ఉత్తీర్ణత సాధించి నవోదయ పాఠశాలలో సీటుకు ఎంపికైయ్యారు. తేజేష్ మాధవరం ఏవీఎస్ పాఠశాలలో చదివారని పాఠశాల ఉపాధ్యాయులకు తేజేష్ తండ్రి శ్రీనివాసప్రసాద్ ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఎఫ్‌డీఓగా బాలరాజు

బ్రహ్మంగారిమఠం: బ్రహ్మంగారిమఠం మత్స్య శాఖ అభివృద్ధి అధికారిగా బాలరాజు నియమితులయ్యారు. కర్నూలు మత్స్యశాఖలో అసిస్టెంట్ ఇంజినీరుగా విధులు నిర్వహిస్తూ పదోన్నతిపై బ్రహ్మంగారి మఠం మండలానికి బదిలీ అయ్యారు. మంగళవారం బాధ్యతలు చేపట్టిన ఆయన మాట్లాడుతూ.. లైసెన్స్ కలిగిన మత్స్యకారులకు ప్రభుత్వం నుంచి స్కూటరు, వలలు, పలు రకాల సామగ్రి రాయితీపై వస్తాయన్నారు. లైసెన్స్ కలిగిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా బీమా చేయించుకోవాలన్నారు. నిషేధ సమయంలో వేటకు వెళ్తే కేసులు నమోదు చేస్తామన్నారు.

విద్యుత్ సమస్యలా... అయితే ఫోన్ చేయండి

కడప కార్పొరేషన్ : కడప నగరంలో ఏవైనా విద్యుత్ సమస్యలు తలెత్తితే కింది నంబర్లకు ఫోన్ చేయాలని విద్యుత్‌శాఖ కడప డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ హరిసేవ్యా నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. కడప టౌన్ పరిధిలో ఇండస్ట్రియల్ ఎస్టేట్, నానాపల్లె, పాతకడప, ఉక్కాయపల్లె, ఐటీపార్క్, రిమ్స్‌ల వద్ద 33/11 కేవీ సబ్‌స్టేషన్లు ఉన్నాయని, వీటి పరిధిలో విద్యుత్ అంతరాయం, లైన్లు తెగిపోవడం, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోవడం, విద్యుత్ ప్రమాదాలు సంభవిస్తే ఈ కింద కనబరిచిన నంబర్లకు ఫోన్ చేసి తెలపాలన్నారు.

సబ్‌స్టేషన్	ప్రాంతాలు	ఫోన్ నంబర్
ఇండస్ట్రియల్ ఎస్టేట్	ఐడీఏ, సబ్‌జైలు, శ్రీరామ్‌నగర్, సరోజినీనగర్, శ్రీరామ్‌నగర్, పీఎస్ నగర్, రాజీవ్ గృహకల్ప, హెలెన్‌కెల్లర్స్, ఆచారికాలనీ, ఎలక్ట్రికల్ కాలనీ, బుడ్డాయపల్లె, టెలీకాం నగర్, సాయినగర్, టిడ్కో	9490615142
నానాపల్లె	నానాపల్లె, నానాపల్లె హౌసింగ్‌లేఔట్, ఎస్‌టీపీ లేఔట్	8977915294
పాతకడప	పాతకడప	9490615143
ఉక్కాయపల్లె	ఆచారి కాలనీ, వైఎస్సార్ కాలనీ, చలమారెడ్డిపల్లె, తిలక నగర్, టిడ్కో-2, ఆర్‌కే నగర్, ఉక్కాయపల్లె, చంద్రవర్ధినగర్, విద్యుత్ నగర్	9491044660
ఐటీ పార్క్	సింగపూర్ టౌన్ షిప్, శిల్పారామం, విన్యాస్ అపార్ట్‌మెంట్	9490419571
రిమ్స్	రిమ్స్, హెచ్‌పీఎస్ స్కూల్, ఇందిరానగర్	9490615132

మీ జీవిత గమ్యం.. మీ చేతుల్లోనే..



మీ గమ్యం మీ చేతుల్లోనే పుస్తకాలతో విద్యార్థులు, అతిథులు

కడప కల్చరల్ : మీ జీవిత గమ్యం మీ చేతుల్లోనే ఉందని వైద్యులు డాక్టర్ విజయనరసింహారెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక వివేకానంద మహిళా డిగ్రీ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ గురుకుల పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో విద్యార్థినులకు స్వామి వివేకానంద బోధనలతో రామకృష్ణ మిషన్ ప్రచురించిన 'మీ గమ్యం మీ చేతుల్లోనే' పుస్తకాలను బహూకరించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన జాతీయ గవర్నింగ్ కౌన్సిల్ సభ్యులు మానస చిన్నపరెడ్డి మాట్లాడుతూ స్వామి వివేకానంద బోధనలతో ఉత్తేజం, సానుకూల దృక్పథం ఏర్పడుతుందన్నారు. గురుకుల పూర్వ విద్యార్థుల సంఘం కార్యదర్శి, యోగా నిపుణులు డాక్టర్ ఆర్.రంగనాథరెడ్డి మాట్లాడుతూ ఒక మంచి పుస్తకం ఒక మంచి స్నేహితుడిగా మనకు జీవితాంతం తోడుగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సైకాలజిస్ట్ ఓ వెంకటేశ్వర రెడ్డి, లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ వెంకటసుబ్బయ్య, మిస్టర్ వి అధినేత భాస్కర్ వర్మ, జోజి రెడ్డి, వెంకట్ నారాయణ రెడ్డి, శ్రీ వివేకానంద కళాశాల కరస్పాండెంట్ మనోహర్ రెడ్డి పాల్గొన్నారు.

ఆస్తి పన్ను ఒకేసారి చెల్లిస్తే 5 శాతం రాయితీ

కడప కార్పొరేషన్ : కడప నగరపాలక సంస్థ పరిధిలోని ఇంటి పన్ను, ఖాళీ స్థలాల పన్నులను ఒకేసారి చెల్లించిన వారికి ప్రభుత్వం 5 శాతం రాయితీ కల్పిస్తున్నట్లు నగరపాలక కమిషనర్ మనోజ్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటి పన్నులు, ఖాళీ స్థలాల పన్నులు మొదటి అర్థ సంవత్సరానికి జూన్ నెలాఖరులో, రెండో అర్థ సంవత్సరానికి డిసెంబర్ నెలాఖరులోపు చెల్లించక పోతే 2 శాతం వడ్డీతో కలిసి చెల్లించాల్సి ఉంటుందన్నారు. పన్ను చెల్లింపుదారుల నుంచి వచ్చిన విజ్ఞప్తి మేరకు పన్ను బకాయిలను మార్చి 31 తేదిలోపు ఒకేసారి చెల్లించిన వారికి 5 శాతం రాయితీ కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఈ సదుపాయం ఇప్పటికే పన్ను బకాయిలు లేకుండా చెల్లించిన వారికి కూడా వర్తిస్తుందన్నారు. ఈ 5 శాతం వడ్డీ రాయితీ వచ్చే ఆర్థిక సంవత్సరం పన్నులకు జమ అవుతుందన్నారు. ఈ సదుపాయాన్ని నగరప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. పన్ను చెల్లింపుదారులు తమ వార్డు సచివాలయాల్లోగానీ, నగరపాలక సంస్థ కౌంటర్లలోగానీ చెల్లించవచ్చన్నారు.

ఆర్టీసీ పురోభివృద్ధిలో డ్రైవర్ల పాత్ర కీలకం



సూచనలిస్తున్న డిప్యూటీ సీఎంఈ లక్ష్మిభాస్కర్

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీ పురోభివృద్ధిలో డ్రైవర్ల పాత్ర కీలకమని కడప డిప్యూటీ సీఎంఈ లక్ష్మిభాస్కర్ సూచించారు. మంగళవారం స్థానిక ఆర్ఎం కార్యాలయంలో ఇంధనం ఆదా చేయడంపై, విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించే డ్రైవర్లకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత ఓం శాంతి ఈశ్వరీయ విశ్వవిద్యాలయంకు చెందిన అక్కయ్యలు మానసిక ప్రశాంతత కోసం యోగ, ధ్యాన ప్రాధాన్యతను వివరించారు. ఈ సందర్భంగా లక్ష్మిభాస్కర్ మాట్లాడుతూ ఆర్టీసీ డ్రైవర్లు ఏకాగ్రతతో విధులు నిర్వర్తించాలన్నారు. ప్రమాదాలు చేయకుండా, నిర్ణీత గడువులోగా ప్రయాణీకులను గమ్యస్థానాలకు చేర్చడంలో డ్రైవర్లు ప్రధానపాత్ర పోషించాల్సి ఉంటుందన్నారు. అనంతరం డ్రైవర్లకు ఇంధనం ఆదాపై పంచ సూత్రాలపై సూచనలు, సలహాలు ఇచ్చారు. మైదుకూరు డిపో మేనేజరు శ్రీరాం కుమార్ మాట్లాడుతూ సేఫ్టీ డ్రైవింగ్ పై సూచనలు సలహాలు ఇచ్చారు. మధ్యాహ్నం ప్రమాదాల నివారణపై ప్రాక్టికల్‌గా శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కడప జోన్ వ్యాప్తంగా వివిధ డిపోలకు చెందిన 18 మంది డ్రైవర్లు, అధికారులు పాల్గొన్నారు.

టీచర్ల పీఎఫ్ స్లిప్‌లను వెబ్‌సైట్‌లో ఉంచాలి



జెడ్పీ డిప్యూటీ సీఈఓ మైథిలికి వినతిపత్రాన్ని సమర్పిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

కడప ఎడ్యుకేషన్ : జిల్లావ్యాప్తంగా జెడ్పీ, మండల పరిషత్ పాఠశాలలలో పనిచేస్తున్న బోధన, బోధనేతర సిబ్బందికి సంబంధించిన ప్రావిడెంట్ ఫండ్ వార్షిక వివరాల స్లిప్‌లను వెబ్‌సైట్‌లో పొందుపరచాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆదిరెడ్డి శ్యాంసుందర్ రెడ్డి కోరారు. ఈ విషయమై మంగళవారం కడప జెడ్పీలో డిప్యూటి సీఈఓ మైథిలిని కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా పరిషత్, మండల పరిషత్ పరిధిలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు 2023–2024 సంవత్సరానికి చెందిన పీఎఫ్ స్లిప్‌లను వెబ్‌సైట్‌లో పొందుపరచాలని, పీఎఫ్ నెలవారీ జమలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ లో ఉంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఖాదర్ బాషా, శ్రీనివాస రెడ్డి, జిల్లా కార్యదర్శి రమేష్ రెడ్డి, రామచంద్రా రెడ్డి, రామసుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలి



మాట్లాడుతున్న సీఐ ఈదురుబాషా

కడప ఎడ్యుకేషన్ : క్రమశిక్షణతో విద్యార్థులు తమ ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని యాంటి హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ సీఐ ఈదురుబాష సూచించారు. మంగళవారం కడపలోని గీతాంజలి కాలేజ్ ఆఫ్ నర్సింగ్‌లో అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే సమాజం పట్ల బాధ్యతాయుతంగా ఉంటూ మంచి పౌరులుగా ఎదగాలని సూచించారు. బాగా చదువుకుని తల్లిదండ్రుల ఆశల్ని, ఆశయాలను నెరవేర్చేలా కృషి చేయాలన్నారు. అనంతరం పోక్సో యాక్టు, ఈవ్ టీజింగ్, డయల్–100, రహదారి భద్రత, సోషల్ మీడియా, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు.

లక్ష్య సాధనలో నిర్లక్ష్యం తగదు



మాట్లాడుతున్న రమేష్‌రెడ్డి

ప్రొద్దుటూరు రూరల్: లక్ష్యాలను అధిగమించడంలో నిర్లక్ష్యం తగదని జిల్లా గణాంకాధికారి రమేష్‌రెడ్డి హెచ్చరించారు. మండలంలోని గోపవరం పంచాయతీలోని ఒకటో సచివాలయాన్ని మంగళవారం జిల్లా టాస్క్‌ఫోర్స్ టీం సందర్శించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్త్రీ గర్భవతిగా నమోదైనప్పటి నుంచి సుఖ ప్రసవం జరిగే వరకు అన్ని రకాల ఆరోగ్య సేవలు అందిస్తూ జాగ్రత్తగా చూసుకోవాల్సిన బాధ్యత ఆశ, అంగన్‌వాడీ, ఆరోగ్య కార్యకర్తలపై ఉందన్నారు. గర్భవతులకు అన్ని విషయాల్లో అవగాహన కల్పించాలన్నారు. రక్తహీనత లేకుండా చూడాలని, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు.